క్లుప్తంగా

10న గురుపౌర్ణమి పూజలు

రొంపిచెర్ల: మండల కేంద్రమైన రొంపిచెర్లలో వెలసిన షిరిడీ సాయిబాబా ఆలయంలో ఈ నెల 10వ తేదీన గురు పౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు ఓ.శ్రీనివాసులు, మునిరాజ తెలిపారు. 10వ తేదీ ఉదయం 11 నుంచి ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. భక్తులకు అన్నదానం చేస్తామని వెల్లడించారు.

వజ్ర వైష్ణవిమాత అలంకరణలో అమ్మవారు



చౌడేపల్లి: మండలంలోని పుదిపట్ల సమీపంలో వెలసిన వైష్ణవి దేవి ఆలయంలో వారాహి నవరాత్రుల ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అమ్మవారిని శుక్రవారం వజ్ర వైష్ణవి మాత అలంకరణలో కొలువుదీర్చారు. ఈ కార్యక్రమానికి ఉభయదారులుగా పుంగనూరుకు చెందిన శ్రీనివాసులు, యశోద, చౌడేపల్లె వాసుదేవులు, రమాదేవి, తెల్లనీళ్లపల్లెకు చెందిన ఓబుల్‌రెడ్డి, మాలతి దంపతులు వ్యవహరించినట్లు అర్చకురాలు శ్రావణి తెలిపారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం సౌందర్యలహరి, సహస్ర నామ పారాయణం చేశారు. అనంతరం అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు.

అమ్మవారి నగలు, తాళిబొట్టు చోరీ




బైరెడ్డిపల్లె ఆలయం వద్ద చోరీ వివరాలు సేకరిస్తున్న పోలీసులు

బైరెడ్డిపల్లి: మండలంలోని పలమనేరు–కుప్పం జాతీయ రహదారిలో వున్న బైరెడ్డిపల్లె బాట గంగమ్మ ఆలయంలో గురువారం రాత్రి దొంగలు పడ్డారు. అమ్మవారి నగలు, తాళిబొట్టు చోరీకి పాల్పడ్డారు. శుక్రవారం ఉదయం ఆలయానికి వచ్చిన అర్చకులు తాళాలు పగులగొట్టి నగలు చోరీ చేసిన విషయాన్ని గుర్తించి స్థానికులు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. అమ్మవారికి అలంకరించిన 20 గ్రాముల బంగారు గొలుసు, 5 తాళిబొట్లు చోరీకి గురైనట్టు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇచ్చిన అప్పు అడిగినందుకు దాడి

చౌడేపల్లి: అప్పుగా ఇచ్చిన సొమ్మును తిరిగి ఇవ్వాలని అడిగినందుకు తనపై దాడిచేశారని పరికిదొనకు చెందిన మల్లికార్జున వాపోయారు. ఆయన శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన కథనం మేరకు.. పరికిదొనకు చెందిన మల్లికార్జున అదే గ్రామానికి చెందిన శివకు కొద్దిరోజుల క్రితం రూ.2700 అప్పుగా ఇచ్చాడు. ఎంతకూ డబ్బు తిరిగి ఇవ్వలేదు. తనకు అవసరాలు ఉన్నాయని, తీసుకున్న అప్పు ఇవ్వాలని శివను కోరాడు. ఆగ్రహం చెందిన అతను తన స్నేహితులతో కలిసి మల్లికార్జునపై దాడి చేశాడు. గాయపడిన అతన్ని కుటుంబ సభ్యులు పుంగనూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

అమ్మవారి సేవలో నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు



బోయకొండలో నాయి బ్రాహ్మణుల సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యానాదయ్య

చౌడేపల్లి: బోయకొండ గంగమ్మ అమ్మవారిని శుక్రవారం నాయీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, టీటీడీ మాజీ సభ్యుడు సిద్దవటం యానాదయ్య దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి అమ్మవారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేసి సత్కరించారు. ఆయన మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఆయన వెంట రాష్ట్ర కార్యదర్శి బూరుగుల సుబ్రహ్మణ్యం, ఆవుల విశ్వనాథరెడ్డి, రెడ్డెప్ప తదితరులు ఉన్నారు.

వేర్వేరు కేసుల్లో ముగ్గురి అరెస్ట్

పుంగనూరు (చౌడేపల్లి): మండలంలోని అడవినాథునికుంట వద్ద జరిగిన వేర్వేరు ఘటనల్లో ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఈ నెల 2న క్రికెట్ ఆడేందుకు వెళ్లిన మహేంద్రరెడ్డిపై అడవినాథునికుంటకు చెందిన మోహన్‌కృష్ణారెడ్డి, కృష్ణారెడ్డి దాడి చేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు మోహన్ కృష్ణారెడ్డి, కృష్ణారెడ్డిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. అలాగే అడవినాథునికుంటకు చెందిన జ్యోతి ఇంట్లో ఉండగా మహేంద్రరెడ్డి స్నేహితుడు మహేష్‌బాబు దాడికి పాల్పడ్డాడు. జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మహేష్‌బాబును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

అటకెక్కిన ఆర్టీఏ సేవలు

పలమనేరులోని మోటారు వాహనాల తనిఖీ కార్యాలయం మూతపడింది. ఇక్కడ అన్ని రకాల సేవలను నిలిపేశారు. మొన్నటిదాకా వాహనాలు, డ్రైవర్లతో కిటకిటలాడిన ఈ కార్యాలయం ఇప్పుడు మూగబోయింది. ఇక్కడి కార్యాలయ సేవలను బంగారుపాళెం లోని ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించారు. దీంతో వాహనాలకు ఎఫ్‌సీల నుంచి అన్ని రకాల సేవల కోసం పలమనేరు, కుప్పం ప్రాంతాల నుంచి వాహనదారులు బంగారుపాళెం వెళ్లాల్సి వస్తోంది. మరోవైపు పట్టణ సమీపంలోని అంతర్రాష్ట్ర వాహనాల తనిఖీ కేంద్రాన్ని సైతం మూసేశారు. దీంతో పన్నులు చెల్లించకుండా వెళుతున్న వాహనాలను పట్టించుకునే వారు కరువయ్యారు.



పలమనేరులోవున్న ఎంవీఐ కార్యాలయం



నిర్మానుష్యంగా మారిన వాహనాల చెకింగ్ ట్రాక్

- నిరుపయోగంగా ఎంవీఐ కార్యాలయం
- పలమనేరులో ఆగిన అన్నిరకాల సేవలు
- ఇక్కడి అధికారులు ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు బదిలీ
- వాహనాల ఎఫ్‌సీ కోసం బంగారుపాళెం వెళ్లాల్సిందే

పలమనేరు: కుప్పం, పలమనేరు నియోజకవర్గాల ప్రజలకు ఎల్‌ఎల్‌ఆర్, డ్రైవింగ్ లైసెన్సులు, హెవీ డ్రైవింగ్ లైసెన్సులు, వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికెట్(ఎఫ్‌సీ), డ్రైవింగ్ పరీక్షలు తదితర సేవల కోసం పలమనేరులో మోటారు వాహనాల తనిఖీ కార్యాలయం ఏర్పాటుచేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.కోటితో ఆధునిక వసతులతో భవనం నిర్మించింది. ఇక్కడ అన్ని రకాల సేవలు అందేలా చర్యలు తీసుకుంది. కూటమి ప్రభుత్వం ఆన్‌లైన్ సేవల్లో భాగంగా ఈ వ్యవస్థను ప్రైవేటు వారికి అప్పగించారు. దీంతో ఇక్కడి కార్యాలయంలో సేవలు లేకుండా పోయాయి. ఇప్పుడు ఏ పని కావాలన్నా బంగారుపాళెం వెళ్లాల్సి వస్తోంది.

నిరుపయోగంగా కార్యాలయ భవనం

రూ.కోటి వ్యయంతో అన్ని సదుపాయాలు కల్పిస్తూ నిర్మించిన కార్యాలయ భవనం, వాహనాల ట్రాక్, కంప్యూటర్లు, ఫర్నీచర్ నిరుపయోగంగా మారాయి. ఇక్కడి అధికారులను ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు బదిలీ చేశారు. రోడ్డుపై ప్రమాదాలు జరిగినప్పుడు వాటిని పరిశీలించి రిపోర్టులివ్వడం, పన్ను కట్టని వాహనాలను తనిఖీ చేసే విధులను వీరికి అప్పగించారు. దీంతో ఒకప్పుడు వాహనాలు, డ్రైవర్లు, సిబ్బందితో కలకలలాడిన కార్యాలయం బోసిపోయింది. కుప్పం ప్రాంతానికి చెందిన వాహనాలు ఎఫ్‌సీ కోసం 88 కిలోమీటర్ల దూరంలోని బంగారుపాళెం రావాల్సిన పరిస్థితి నెలకొంది.

అంతర్రాష్ట్ర చెక్ పోస్టు మూత

పలమనేరు పట్టణ సమీపంలోని రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాన్ని గతేడాది మార్చిలో తొలగించారు. ఈ కార్యాలయంలో పనిచేసే అధికారులను అదేశాఖలో స్క్వాడ్ డ్యూటీలు, హెడ్ ఆఫీసు విధులకు పంపించారు. డిజిటల్ సేవలు అందుబాటులోకి రావడంతో యాప్ ద్వారా పన్నుల చెల్లింపును కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన విషయం తెలిసిందే.

ప్రభుత్వ ఆదాయానికి గండి

పలమనేరు కర్ణాటకకు సరిహద్దు ప్రాంతం. అక్రమ రవాణా జోరుగా సాగుతుండడంతో గతంలో ఇక్కడ చెక్‌పోస్టు ఏర్పాటుచేశారు. ఇప్పుడు కేంద్రం డిజిటల్ సేవలను అందుబాటులోకి తీసుకురావడంతో చెక్‌పోస్టును ఎత్తేసేశారు. దీంతో అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. నిత్యం ఎన్నో వాహనాలు పన్నులు కట్టకుండా వెళుతుండడంతో ప్రభుత్వ ఖజానాకు గండిపడుతోంది. గతంలో ఇక్కడ చెక్‌పోస్టు వున్నప్పుడు వాహనాలను తనిఖీ చేసేవారు. నిబంధనలకు విరుద్ధంగా వెళ్లే వాహనాలు, అధిక టన్నేజి, పర్మిట్లు, సెస్ తదితరాల నిర్వహణ పటిష్టంగా జరిగేది. చెక్‌పోస్ట్ లేకపోవడంతో ఈ మార్గంలో కర్ణాటకకు ఎర్రచందనం, బియ్యం, తమిళనాడుకు గ్రానైట్ అక్రమంగా తరలివెళుతున్నాయి. కర్ణాటక నుంచి పలు వస్తువులు, ఉత్పత్తులు పన్నులు లేకుండా జిల్లాలోకి చేరుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును పునఃప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు. అదే విధంగా స్థానిక ఎంవీఐ కార్యాలయ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని పలమనేరు, కుప్పం నియోజకవర్గాల వారు కోరుతున్నారు.

బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు

పుంగనూరు(చౌడేపల్లె): మండలంలోని బండ్లపల్లె టోల్‌గేట్ సమీపంలో గురువారం రాత్రి బైక్ ఢీకొనడంతో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు.. పుంగనూరు పట్టణానికి చెందిన చెంగల్రాయప్ప(55) బండ్లపల్లె సమీపంలో రోడ్డుపై నడిచి వెళ్తుండగా వేగంగా వచ్చిన బైక్ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతన్ని స్థానికులు 108లో ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

పుంగనూరు(చౌడేపల్లె): సమస్యలు పరిష్కరించాలని ఆర్టీసీ ఉద్యోగులు డిమాండ్ చేశారు. వారు శుక్రవారం ఏపీ పీటీడీ ఎంప్లాయీస్ పిలుపుమేరకు పుంగనూరు పట్టణంలోని ఆర్టీసీ డిపో కార్యాలయం ముందు నిరసన తెలిపారు. జిల్లా సెక్రటరీ బాలరామమూర్తి మాట్లాడుతూ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని, విద్యుత్ బస్సులను ఆర్టీసీ ద్వారానే నిర్వహించాలని కోరారు. ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి, జెండాలు పట్టుకుని నినాదాలు చేశారు.

178 మందికి ఉద్యోగాలు

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 178 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గుణశేఖర్ తెలిపారు. ఇందులో పలు రాష్ట్రాలకు చెందిన 20 బహుళ జాతి కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించినట్టు వెల్లడించారు. మొత్తం 489 మంది హాజరుకాగా 178 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్టు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, స్కిల్ హబ్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న గుర్తు తెలియని వాహనం



విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటుచేస్తున్న సిబ్బంది

చౌడేపల్లి: మండల కేంద్రమైన చౌడేపల్లెలోని బోయకొండ బైపాస్ ఆర్చి వద్ద రోడ్డు పక్కనున్న విద్యుత్ స్తంభాన్ని శుక్రవారం గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో స్తంభం విరిగిపోయింది. దాన్ని గుర్తించిన లైన్‌మన్ సుబ్రమణ్యం విషయాన్ని ట్రాన్స్‌కో ఏఈ శశిధర్ దృష్టికి తీసుకెళ్లారు. యుద్ధ ప్రాతిపదికన ట్రాన్స్‌కో అధికారులు స్తంభాన్ని తొలగించి కొత్తదాన్ని ఏర్పాటుచేశారు. నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే ఈ రోడ్డులో ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

11 గంటలైనా తెరుచుకోని సచివాలయం



సిబ్బంది లేకపోవడంతో నిరీక్షిస్తున్న అర్జీదారులు

చౌడేపల్లె: మండలంలోని పలు సచివాలయాల సిబ్బంది సమయ పాలన పాటించడం లేదు. విధులకు ఆలస్యంగా వస్తున్నారు. దీంతో వివిధ పనుల మీద కార్యాలయానికి వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని చారాల సచివాలయం శుక్రవారం 11 గంటలైనా తెరుచుకోలేదు. వివిధ పనుల నిమిత్తం గ్రామాల నుంచి వచ్చిన పలువురు ప్రజలు సచివాలయం వద్దే పడిగాపులు పడ్డారు. ఇక్కడి సిబ్బంది ఎప్పుడూ ఆలస్యంగా వస్తుంటారని స్థానికులు చెబుతున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడంతోనే సచివాలయ సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం



టీచర్లను సన్మానిస్తున్న డీవైఈవో ఇందిర

రొంపిచెర్ల: రొంపిచెర్ల ఉర్దూ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ బదిలీ అయిన ఆరుగురు ఉపాధ్యాయులను శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఇందులో చిత్తూరు జిల్లా ఇన్‌చార్జి డీవైఈవో ఇందిర ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. విద్యార్థుల బంగారు భవితవ్యం ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని, వారిని ఉన్నతంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ ఇబ్రహీంఖాన్ మాట్లాడుతూ ఉర్దూ ఉన్నత పాఠశాలలో పదో తరగతి ఫలితాల్లో మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.10 వేలు ఇస్తానని ప్రకటించారు. అనంతరం ఉపాధ్యాయులు ప్రకాష్, నసీమా, ఆసిఫా, ఫయాజ్, శైలజ, రేణుకను పూలమాలలు వేసి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్కదేవతలకు పూజలు



విశేషాలంకరణలో అక్కదేవతలు

పుంగనూరు(చౌడేపల్లె): పుంగనూరు మండలం అమ్మిగానిపల్లెలో శుక్రవారం అక్కదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు బాగా కురవాలని, పంటలు పండాలని, గ్రామం సుభిక్షంగా ఉండాలని కోరుతూ గ్రామస్తులు ప్రతి ఏటా అక్కదేవతలకు పూజలు చేయడం ఆనవాయితీ. ఇందులో భాగంగా గ్రామస్తులు అక్కదేవతలకు పూలు, గాజులు, పసుపు, కుంకుమ, నిమ్మకాయలు పెట్టి పచ్చవేసి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అమ్మవారికి శాఖాహర వంటలను నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అన్నసమారాధన చేశారు. పూజలు జరుగుతున్న సమయంలో వర్షం రావడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

సుగుటూరు గంగమ్మకు..

పుంగనూరు పట్టణంలోని బెస్తవీధిలో వెలసిన సుగుటూరు గంగమ్మకు ఆషాడమాసపు శుక్రవారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో ఆలయం వద్దకు చేరుకుని నైవేద్యం పెట్టారు. కోర్కెలు తీరిన భక్తులు మొక్కులు చెల్లించారు.

మా బిడ్డకు ప్రాణం పోయండి

- బాధిత చిన్నారి తల్లిదండ్రులు వేడుకోలు



సమావేశంలో మాట్లాడుతున్న చిన్నారి రవితేజ తల్లిదండ్రులు రూప, శ్రీనివాసులు

తిరుపతి కల్చరల్: మెదడులో నీరు చేరి ఎలాంటి ఎదుగూబొదుగూ లేక అనారోగ్యంతో బాధపడుతున్న తమ బిడ్డ రవితేజ(2) శస్త్ర చికిత్సకు ఆర్థిక సాయం అందించి ప్రాణాలను కాపాడాలని ఆ చిన్నారి తల్లిదండ్రులు రూప, శ్రీనివాసులు మీడియా ముందు వేడుకున్నారు. శుక్రవారం వారు తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పుంగనూరు మండలం నరసాపురం గ్రామానికి చెందిన తాము ప్రస్తుతం తిరుపతిలోని కపిలతీర్థం సమీపంలో నున్న అయ్యప్ప కాలనీలో నివాసం ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు. తమకు కుమార్తెతో పాటు రెండేళ్ల కుమారుడు రవితేజ ఉన్నాడని, అయితే బాబు పుట్టిన ఐదు నెలల నుంచి అనారోగ్యంతో ఉండడంతో రుయాలో చూపించామని, మెదడులో నీరు చేరిందని, మెదడులో (సెరెబ్రోస్పైనల్ ఫ్లూయిడ్) ప్రవాహానికి అడ్డు పడడంతో తీవ్ర అనారోగ్యం బారిన పడ్డారని వైద్యులు తెలిపారన్నారు. దీంతో బెంగళూరులోని ఇందిరాగాంధీ ఆసుపత్రిలో వైద్యం చేయించడంతో తల నుంచి పొట్టలోకి ట్యూబ్ అమర్చడం జరిగిందన్నారు. తలకు శస్త్ర చికిత్స చేస్తే ప్రాణాపాయం నుంచి బయట పడతారని వైద్యులు చెప్పి వేలూరు సీఎంసీకి వెళ్లాలని చెప్పారన్నారు. సీఎంసీ వైద్యులను కలిస్తే బిడ్డకు తక్షణం ఆపరేషన్ చేయాలని ఇందుకు రూ.7 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారని తెలిపారు. నిరుపేదలమైన తాము బిడ్డను బతికించుకునేందుకు ఇప్పటికే అప్పు చేసి రూ.12 లక్షలు ఖర్చు పెట్టామని వాపోయారు. తమ బిడ్డ శస్త్ర చికిత్సకు అవసరమైన డబ్బులు దాతలు ముందుకు వచ్చి సాయం చేసి తన బిడ్డ ప్రాణాలను కాపాడాలని వారు విజ్ఞప్తి చేశారు. ఆర్థిక సాయం అందించాలనుకునే దాతలు 8247773465 నంబరులో సంప్రదించాలని వేడుకున్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్



సీనియర్ సివిల్ జడ్జి ఆదినారాయణ

పలమనేరు: పట్టణంలోని సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, పట్టణ సమీపంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు పలమనేరు సీనియర్ సివిల్ జడ్జి ఆదినారాయణ తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. రాజీ మార్గమే రాచమార్గమని తెలిపారు. కక్షిదారులు అనవసరమైన పంతాలకు పోకుండా కేసులను రాజీ చేసుకుని వ్యయ ప్రయాసలను తగ్గించుకోవాలన్నారు. లోక్ అదాలత్‌లో ప్రిలిటిగేషన్ కేసులను కూడా పరిష్కరించుకోవచ్చునని సూచించారు. చెక్‌బౌన్స్, జీవనాధారం, వేధింపులు, గృహహింస తదితర సివిల్, క్రిమినల్ కేసులు రాజీ చేసుకునేందుకు ఇది మంచి అవకాశమన్నారు. లోక్ అదాలత్ తీర్పు సుప్రీం తీర్పుతో సమానమని తెలిపారు. నేటి లోక్ అదాలత్ కోసం అవసరమైన ఏర్పాట్లు చేశామన్నారు. పోలీసులు, న్యాయవాదులు చొరవ తీసుకుని ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని సూచించారు.

ఘనంగా మొహర్రం వేడుకలు



పీర్లకు పూజలు చేస్తున్న నిర్వాహకులు

పుంగనూరు(చౌడేపల్లె): పుంగనూరు పట్టణంలోని రాతిమసీదు వీధిలోవున్న సయ్యద్ మదని–హజరత్ సయ్యద్ జలాల్ దర్గాలో శుక్రవారం మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీర్లకు పూజలు చేసి, అన్నదానం చేశారు. షరబత్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఇమ్రాన్, జావీద్, లియాఖత్, రిజ్వాన్, ఇనాయతుల్లా షరీఫ్, ఇర్ఫాన్, అంజాద్, న్యామత్ తదితరులు పాల్గొన్నారు.

నూతన పింఛన్ల పంపిణీ

గుడుపల్లె: నూతనంగా మంజూరైన వివిధ రకాల పింఛన్లను శుక్రవారం ఎంపీడీవో రాధాక్రిష్ణ, ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో 420 మందికి వృద్ధాప్య, వికలాంగ, వితంతు పింఛన్లు మంజూరైనట్టు ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బాబునాయుడు, చంద్రశేఖర్, అధికారులు పాల్గొన్నారు.

రేపు కళామందిర్ మూడో వార్షికోత్సవం

పలమనేరు: పట్టణ సమీపంలోని సాయినగర్ కళామందిరం మూడో వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్టు తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసీనాథం నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా 20 మంది కవులు, రచయితలు, భాషాభిమానులకు జాతీయ స్థాయి పురస్కారాలు అందజేస్తామని తెలిపారు. అదే విధంగా వందకు పైగా పద్యాలు చెప్పిన 50 మంది విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

నేడు బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీపై సమావేశాలు

పలమనేరు/పెద్దపంజాణి: నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో శనివారం (ఇంటింటికీ వంచన) బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్ ద్వారా ప్రచారం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్ సీపీ కార్యాలయ సిబ్బంది తెలిపారు. ఇందులో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ వెంకటేగౌడ హాజరుకానున్నట్టు పేర్కొన్నారు. శనివారం ఉదయం 9 గంటలకు పలమనేరు పార్టీ కార్యాలయంలో పలమనేరు మున్సిపాలిటీ, రూరల్ మండలం, ఉదయం 10.30 గంటలకు పెద్దపంజాణి, మధ్యాహ్నం 2 గంటలకు గంగవరం, 3.45 గంటలకు వి.కోటలో కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆయా మండలాల పార్టీ శ్రేణులు, నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

కోరం లేక ఆగిన మండల సమావేశం

గంగవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించాల్సి ఉంది. ప్రజాప్రతినిధులు గైర్హాజరు కావడంతో కోరం లేకపోవడంతో ఆగిపోయింది. సమావేశాన్ని శనివారానికి వాయిదా వేసినట్టు ఎంపీడీవో తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



ఆర్డీవోకు వినతి పత్రమిస్తున్న బాస్ నాయకులు

పలమనేరు: అన్నమయ్య జిల్లా మదనపల్లె సమీపంలోని అంకిశెట్టిపల్లి బుద్ధుడి కొండపై బుద్ధుడి విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని స్థానిక భారతీయ అంబేడ్కర్ సేన నాయకులు గణపతి, దొరస్వామి కోరారు. వారు శుక్రవారం పలమనేరు ఆర్డీవో భవానికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ అంకిశెట్టిపల్లి సమీపంలోని కొండపై వున్న బుద్ధ విహారం మానసిక వికాస కేంద్రంగా ఉందన్నారు. ఇక్కడ గతంలో మూడుసార్లు బుద్ధుడి విగ్రహాన్ని ధ్వంసం చేశారని వెల్లడించారు. పోలీసులు నిందితులను కాపాడేందుకు కేసును నీరుగార్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని వారు కోరారు.

సుబ్రహ్మణ్యం మృతి బాధాకరం



కందూరులో సుబ్రహ్మణ్యంరెడ్డికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి



పెద్ద ఉప్పరపల్లెలో శేషాద్రి కుటుంబ సభ్యులతో రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి

సోమల(చౌడేపల్లె): మండలంలోని కందూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కందూరు రాజారెడ్డి తండ్రి సుబ్రహ్మణ్యం రెడ్డి(69) మృతి బాధాకరమని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి విచారం వ్యక్తం చేశారు. వారు శుక్రవారం కందూరుకు చేరుకుని సుబ్రహ్మణ్యం పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మృతి పార్టీకు తీరనిలోటని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. అలాగే పెద్ద ఉప్పరపల్లెలో వైఎస్సార్ సీపీ నాయకుడు శేషాద్రి తల్లి తోట వేదవతమ్మ (76) ఇటీవల మృతిచెందారు. వారి కుటుంబాన్ని రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి పరామర్శించి ఓదార్చారు. ఏకష్టమొచ్చినా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నడిగడ్డ వెంకటరమణ, పార్టీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, నాయకులు పగడాల శివకుమార్, నాగభూషణరెడ్డి, పీఎల్ఆర్ రాజారెడ్డి, మల్లికార్జునరెడ్డి, కృష్ణంనాయుడు, శీలం భాస్కర్, గాలి సురేష్, షేక్ బాషా, షావలీ, మెకానిక్ బాషా, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

డెంగీతో అప్రమత్తంగా ఉండాలి



డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

వి.కోట: డెంగీపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ తెలిపారు. ఆయన శుక్రవారం డెంగీ నివారణ మాసోత్సవాల్లో భాగంగా ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలతో కలిసి వి.కోటలో డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డెంగీ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. టైర్లు, టెంకాయ చిప్పలు తదితరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. దోమల లార్వాలు పెరిగే ప్రాంతాలను గుర్తించి మందు పిచికారి చేయించాలన్నారు. సిబ్బంది వెక్టార్ కంట్రోల్ యాప్‌ను సక్రమంగా ఉపయోగించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈవో శ్రీనాథ్‌రెడ్డి, సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి సీతారామరాజుకు ఘన నివాళి



అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న భక్తవత్సలరాజు

పుంగనూరు(చౌడేపల్లె): మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు బ్రిటీష్ పాలకులకు ఎదిరించి వీర మరణం పొందారని క్షత్రియ సంఘం అధ్యక్షుడు భక్తవత్సలరాజు తెలిపారు. పుంగనూరు పట్టణంలోని గోకుల్ సర్కిల్‌లో శుక్రవారం అల్లూరి సీతారామరాజు జయంతిని జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే శుభారాం డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలోఅల్లూరి జయంతి వేడుకలు నిర్వహించారు. క్షత్రియ సంఘం వారు అన్నదానం చేశారు. కార్యక్రమంలో భాస్కర్‌రాజు, సతీష్‌రాజు, జ్యోతిరాజు, మఠంబాబు, వెంకటరెడ్డి, చిన్న, ప్రభాకర్‌రాజు, మురళీరాజు, నాగరాజ, ఈశ్వర్‌రాజు, సుదర్శన్‌రాజు పాల్గొన్నారు.